# 25

* శ్రీ ఐ. యస్. రామారావు *

[ఇదొక చక్కటి చిన్న హాస్య రచన. ఏ ప్రశ్న వేసుకున్నా యిరవై ఐదే జవాబు వస్తోంది కథకునికి.]

## Twenty five

పచ్చాస్

ఇరువత్తంజి

ఇరవై ఐదు

ఎవడ్రా నన్నిట్లా పిలుస్తున్నాడని చూశాను. 'ఏయ్! నిన్నే' మళ్ళీ పిలుపు వినిపించింది, శూన్యంలోంచి.

మారుపేరుతో పిలుస్తూన్నందుకు మంట నషాళానికి ఎక్కినట్లయింది...మానవాకృతి కనుపించకపోయేసరికి, దయ్యమో, భూతమోనని భయటూ వేసింది......అయినా ధైర్యం చేశా...... ఎంతైనా మగవాణ్ణిగదా!......

'ఎవరు నీవు? నేనెవరో తెలుసా? అంటూ గద్దింపుగా కేకేశా......

'నీవెవరవో, నీకథా కమామిష్ అంతా బాగా తెలిసే మాట్లాడుతున్నాను' అంది ధ్వని.

'కాని నా పేరు అదికాదే. నా పేరు రాజా.'

'అవును, మీవాళ్లు నీకు పెట్టినపేరు అది... నీకు 'నేను పెట్టినపేరు ఇది' అంది.

'నాలుగుదిక్కులా చూచా ఎవరూలేరు... మాటలు మాత్రం వినబడుతూన్నాయి ... అయినా ఏం తేలుతుందోనని నేనూ ఎదురు మాట్లాడాలనుకున్నాను.

నాకెప్పుడూ ఇలాంటిపేరు ఎవ్వరూ పెట్టలేదే. నన్ను కోపముతోకూడా ఎవ్వరూ ఇంత వ్యంగ్యంగా పిలవరే. నా హైస్కూల్ రోజుల్లో 'స్టేజ్ ఫ్లవర్' అనీ, కాలేజీ రోజుల్లో 'అభినవ పోర్షియో' అనీ, నిరుద్యోగపు రోజుల్లో 'రంగేళిరాజా' అనీ, ఇప్పుడు 'అపర్చ్యూనిష్టు' అంటూవుంటారు. లేకపోతే కోపంమీద మాత్రం మా డుప్లికేట్ బావమరది 'పేడుమూతి' అంటూవుంటే నేనుకూడా ట్రయల్ పెట్టు అంటూ వుంటాను. ఇంతే... అవేవీకాకుండా తమరో కొత్తపేరా తగిలించేది?

'ఆ పేరు పెట్టడంవల్ల నీకు కోపం వచ్చిందా- అవునులే వున్నమాటంటే వులుకెక్కువే! నీచరిత్ర నీసంగతి నీకు జ్ఞాపకమెట్లా వుంటుంది?

నేను వేస్తున్న యీ ప్రశ్నలకు సమాధానం చెప్పు. నీకాపేరు వుచితమో, అనుచితమో తెలుస్తుంది.

'అయితే యక్షప్రశ్నలతో చంపేస్తావా ఏమిటి?' అన్నా.

'ఇస్తూ......నీ వయస్సెంత?'

25 సంవత్సరములు.

నీ జీతము?

25 రూపాయీలు.

మీ అమ్మ నీకు నెలకెంత పంపిస్తుంది?

25 రూపాయీలు.

నీకు రేడియో ప్రోగ్రాముల్లో ఇచ్చేదెంత?

25 రూపాయీలూ.

నీవు రోజూ కాల్చే సిగరెట్లెన్ని?

25.

నీవు ఆఫీసులో చేసే కేసులెన్ని?

25.

నీవు అత్తవారింటికి వెళ్ళినపుడు వారు యిచ్చేదెంత?

25 రూపాయిలు.

నీవు వారింట్లోవుండే దెంత కాలము?

25 గంటలు.

మీవూరికి వారివూరికి ఎన్ని మైళ్లు?

అప్పుడే గ్రుడ్లు తేలేస్తున్నావేం. ఇందాక హుంకరించావుగా చెప్పు అని గద్దించింది.

50 మైళ్లు,

25 కు రెండురెట్లు, అను.

నీకు పెండ్లయిన తేదీ ఎంత?

25 ప్రాంతాల్లో.

మీ యింటికి ఆఫీసుకు నడక ఎంత టయిము తీసుకుంటుంది?

25 నిమిషాలు.

'ఇంకా వున్నారయా, అయిపోయాయా అన్నా' దీనంగా.

'ఇంకా చాలదూ, పైగా కోపముకూడాను' అంటూవుండగా కిలకిలమంటూ నవ్వువినపడింది.

'ఏమండోయ్ ప్రొద్దెక్కిండి. ఏమిటి ఆ దిండును, కౌగలించుకుంటూ నలుపుతూ, నొక్కుతూ, 25 నామస్మరణ చేస్తున్నారు. రామనామస్మరణ లాగా అంటూ లేపింది' మా ప్రభ.

'టైం ఎంతైంది......ప్రభను అడిగాను లేస్తూ-'7—25' జబాబు.

'ఈ 25 తద్దినం రాత్రింబగళ్లు తప్పదన్న మాట.'


ముఖ అందానికి, కాంతి, నునుపు అమూల్యమైనది

సైబాల్ ★ **CIBOL**

[రిజిష్టర్డ్] **(Registered)**

ఇంకా పుండ్లు, రణగడ్డలు, కాల్పులు, పిల్లల చీడ, గజ్జి మొదలయినవాటికికూడా అమోఘంగా పనిచేస్తుంది.

చర్మాన్ని రక్షించి కాంతివంతంగా చేసేదానిలో దీనిని మించినదిలేదు.

అమ్మకటకు అంతటా ఏజంట్లు కావలెను.

తయారుచేయువారు :

THE SOUTH INDIAN Mfg. Co., MADURA.

మదరాసు, ఆంధ్రజిల్లాలకు ఏజంట్లు !

రాజన్ డ్రగ్ స్టోర్సు,

155, నైనియప్ప నాయకన్ వీధి, పి. టి., మదరాసు.